# అహింసాత్మక జీవనం


ఈ సృష్టిలో మనిషి సైతం జీవించడానికే జన్మించాడు. అంతే తప్ప, అతడొక్కడే జీవించడానికి కాదు. సకల జీవ రాశులూ మనిషికి అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నాయి. అతడి జీవన గమనాన్ని నల్లేరు మీద బండి నడకలా చేస్తున్నాయి. పంచభూతాలతో పాటు చెట్టూచేమల ఉపకారం లేకుంటే, మానవుడి మనుగడ ప్రశ్నార్థకమే! ఇది గ్రహించక- తానొక్కడే బుద్ధిజీవి అని, సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్నానని అతడు తెగ సంబరపడు తుంటాడు. సాటి ప్రాణుల్ని చిన్నచూపు చూస్తుంటాడు.

జీవాలకు దైహికంగా, మానసికంగా వేదన కలిగించేది 'హింస' అని పెద్దలు చెబుతారు. చెట్లను కొట్టివేయ డమూ హింసే! 'అహింసో పరమోధర్మః' అని ఉపని షత్తులు బోధిస్తాయి. భూతదయను మించిన పుణ్యం, హింసను మించిన పాపం లేవని వేదాలు ఉపదేశిస్తాయి. దానం, ధర్మం, యజ్ఞయాగాదులకు మించిన స్థానం అహింసకు దక్కుతుందని విజ్ఞుల మాట.

హింస మూడు రకాలు. అది మానసిక, శారీరక, వాచిక సంబంధమైనది. పరులకు హాని తలపెట్టడం, మనో నిగ్రహం లేకపోవడం, పాపభీతి లేకుండా ప్రవర్తిం చడం- మానసిక హింస. అసత్యాన్ని పలకడం, అహి తంగా లేదా కఠినంగా మాట్లాడటం వాచిక హింస. ఏ జీవినైనా చంపడం, గాయపరచడం, పీడించడం, స్త్రీలను చెరపట్టడం, పర ధనాపహరణం వంటివి శారీరక హింస కిందకు వస్తాయి.

అహింస అన్ని ధర్మాలకన్నా ఉత్తమమైనది. బౌద్ధ, జైన మతాల్లో అహింసకు అగ్రతాంబూలమిస్తారు. జీవ పరిణామ క్రమంలో ముందంజలో ఉన్న మానవుడు తన ఆలోచనలు, ఆశయాలు, రుజువర్తనతో పాటు అహిం సాత్మక సద్భావనల్ని సకల జీవరాశి పట్లా కనబరచాలి. ఎంతో సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించిన మహ నీయులున్నారు. వారు నిరాడంబర జీవన విధానంతో, అహింసాత్మక ప్రవృత్తితో అందరి మన్ననలూ చూరగొని చరిత్రలో నిలిచిపోయారు.

ప్రతి ఒక్కరిలోనూ బలహీనతలు, లోపాలు ఉంటాయి. అవి తమను హింసామార్గం వైపు మళ్లించకుండా వారు జాగ్రత్తపడాలి. భావోద్వేగాల తీవ్రతను అణచుకోవాలి. తమను తాము సంబాళించుకోవాలి. అహం కారం- హింస లక్షణం. రాక్షసులు కన్నూ మిన్నూ కానక దేవతల్ని దూషించి, హింసించి, చివరకు మట్టిలో కలిసిపోయిన వైనాన్ని పురాణాలు తెలియజెబుతున్నాయి. అహంకారాన్ని త్యజించకుండా భగ వత్ కృప పొందడం అసాధ్యం.



అంతర్యామి

రుషుల్ని బాధించి, పక్షుల్ని వేటాడి చంపే వ్యక్తి చివరికి వైరాగ్యంతో వాల్మీకిగా మారి శ్రీమ ద్రామాయణం రచించాడు. మానవాళి సంబంధ బాంధవ్యా లకు, జీవన విధానానికి అక్షర రూప మిచ్చాడు. కారణజన్ముడై, ఆచంద్ర తారార్కం కీర్తిచంద్రికలు నిలిచే మహా భాగ్యశాలి అనిపించుకున్నాడు. అహింసతో పాటు ఇంద్రియ నిగ్రహం, భూతదయ, సహనం, శాంతం, తపస్సు, ధ్యానం, సత్యం అనేవి ఎని మిది పుష్పాలు. వాటిలో మహావిష్ణు వుకు అత్యంత ప్రీతికరమైంది- మొట్ట మొదటిదైన అహింసే!

భగవద్గీత పదహారో అధ్యా యంలో శ్రీకృష్ణుడు దైవగుణాల గురించి ప్రవచిస్తాడు. భయం లేకపోవడం, స్వచ్ఛమైన మనసు, ఆధ్యాత్మిక జ్ఞాననిష్ఠ, ఆత్మనిగ్రహం, యజ్ఞాచరణ, వేదాధ్యయనం, తపస్సు- దైవగుణాలు. స్పష్టత, అహింస, సత్యం, కోపం లేకుండటం, త్యాగం, శాంతి, ఎదుటివారిలో దోషాలు ఎంచకపోవడం, భూతదయ, లోభం లేకపోవడమూ దైవగుణాల కిందకే వస్తాయి.

మన దేశాన్ని పరమ హింసాత్మకంగా పరిపాలించిన ఆంగ్లేయుల్ని గాంధీమహాత్ముడు సంయమనం, శాంతి సందేశాలతో ఎదుర్కొన్నారు. తన అహింసాత్మక వాదంతో వాళ్లు దేశాన్ని వదిలిపోయేలా చేసిన ఆయన 'భారత జాతిపిత'గా నిలిచారు.

హింసాత్మక ఆలోచనల్ని మనిషి తన మనసు నుంచి తొలగిస్తే, ప్రశాంతత ఆవరిస్తుంది. అహింసతో పాటు శాంతి పరిఢవిల్లుతుంది. అహింసే అతడి జీవన విధాన మైతే- ఆధ్యాత్మిక మార్గం మరింత సుగమమై, అంత ర్యామి దర్శనం సులభతరమవుతుంది!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు